క్లుప్తంగా

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వేంకటేశ్వరమెట్టపై అలిమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం రెండో ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించారు. ఉషా ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తుల గోత్రనామాలతో విశేష అభిషేకాలు చేపట్టారు.

క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం వినతి



పరశురామరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: క్రైస్తవులకు విశాఖలో శ్మశాన వాటికల కోసం స్థలం కేటాయించాలని, అందుకు సంబంధించిన ఫైల్ సిద్ధంగా ఉందని బీజేపీ మైనార్టీ మోర్చా నాయకులు ఓ.ఆల్బర్ట్, సీహెచ్ రాజుబాబు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎస్.పరశురామ్ రాజును మైనార్టీ విభాగం నాయకులు ఆదివారం కలిసి కోరారు. అనంతరం క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఇవే సమస్యలపై గతంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు కూడా వినతిపత్రం అందజేశామని తెలిపారు. అనంతరం పరశురామరాజును సన్మానించారు. కార్యక్రమంలో ఓ ఆల్బర్ట్, డాక్టర్ వారా జాకబ్, రాజుబాబు, దానేష్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో బీజేపీ బలోపేతానికి కృషి



పురందేశ్వరిని గజమాలతో సత్కరిస్తున్న సంతోష్ తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త, మత్స్యకార నాయకుడు వాసుపల్లి సంతోష్ కుమార్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. పార్టీ నాయకులతో కలిసి పురందేశ్వరి పార్టీ కండువా కప్పి ఆయన్ను ఆహ్వానించారు. అనంతరం ఆయన, అనుచరులతో కలిసి గజమాలతో పురందేశ్వరిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ ఆలయంలో ముగిసిన సంకీర్తనలు



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి పర్వదిన వేడుకల్లో భాగంగా నిర్వహించిన సంకీర్తన ఆదివారం ఘనంగా ముగిసింది. ఆలయ ఈవో జి.వి.రమాభాయి పర్యవేక్షణలో దేవస్థానం ఆవరణలో హరిహర నామ సంకీర్తన ఏకాహ మహోత్సవాన్ని శనివారం వైభవంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. భజన బృందాలు గీతాలాపనలు,"సంకీర్తనలు ఆలపించాయి. అర్చకులు జి.శ్రీనివాసరావు హారతి ఇచ్చి సంకీర్తనలను ముగించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మెగా లేదు.. దగానే...!





- ఎన్నికల వేళ మెగా డీఎస్సీ అంటూ ప్రగల్భాలు పలికిన చంద్రబాబు
- అధికారంలోకి వచ్చాక అదిగో.. ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్న కూటమి ప్రభుత్వం
- నిరుద్యోగులతో కూటమి సర్కార్ బంతాట
- ప్రభుత్వ తీరుపై ఆశావాహుల ఆగ్రహం

గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు

అల్లిపురం: అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ తీస్తామంటూ చంద్రబాబు చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. అన్నట్లుగానే గత ఏడాది జూన్ 12న కొత్త ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటనపై సంతకం చేయడంతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. దీంతో తాము చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలు సైతం మానేసి నెలల తరబడి శిక్షణ పొందుతున్నారు. ఆ తర్వాత గత నవంబర్‌లో అసెంబ్లీ సాక్షిగా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటనకే నోటిఫికేషన్ పరిమితమైంది. తర్వాత డీఎస్సీ గురించి ఉలుకు పలుకు లేకపోవడంతో నిరుద్యోగులు నిరాశకు గురవుతున్నారు. న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువరిస్తామని ప్రకటించినా... ఆ దిశగా కనీస కదలిక లేదు. రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడంతో అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోటి ఆశలతో ఎదురుచూపులు

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ గత ఏడాది నవంబర్ మొదటి వారంలోనే వెలువరించాల్సి ఉంది. నోటిఫికేషన్ వెలువడటానికి ముందు రిజర్వేషన్ల అమలుపై అభ్యంతరాలు రావడంతో డీఎస్సీ నోటిఫికేషన్ నిలిచిపోయింది. మరో వైపు అందరికీ ఆమోదయోగ్యంగా, లీగల్ లిటిగేషన్స్ లేకుండా నోటిఫికేషన్ ఇస్తామని, పెండింగ్ ఖాళీలు సహా అన్ని ఉద్యోగాలను వచ్చే ఏడాది నాటికి భర్తీ చేస్తామని నారా లోకేష్ అసెంబ్లీలో గత ఏడాది ప్రకటించారు. 2024 జనవరిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 6,100 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నోటిఫికేషన్ రద్దు చేసి దాని స్థానంలో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఎస్సీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో తీర్పు పెండింగ్‌లో ఉన్నందున రిజర్వేషన్లు ఖరారైన తర్వాత కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాజా నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఆ అడ్డంకులన్నీ ఎప్పుడు తొలగుతాయి... ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తారని అభ్యర్థులు కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారు.

నెలల తరబడి పుస్తకాలతో కుస్తీ



డీఎస్సీ నియామకాల్లో ఏళ్ల తరబడి జరుగుతున్న జాప్యం నిరుద్యోగుల్ని నిరాశకు గురి చేస్తోంది. 1994కు ముందు టీచర్ల నియామకాలు జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరిగేవి. 1994 నుంచి రాష్ట్ర స్థాయిలో డీఎస్సీ ద్వారా నియామకాలు చేపడుతున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఫిబ్రవరిలో 6100 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని త్వరలోనే జరిగే పరీక్షలకు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల నోటిఫికేష్ విడుదలైంది. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పరీక్షలు రాసే స్థాయిలో ఉన్న డీఎస్సీని రద్దు చేసి నిరుద్యోగుల నెత్తిన పిడుగువేసింది. రోజూ జిల్లా గ్రంథాలయానికి, అల్లిపురం శాఖా గ్రంథాలయంతోపాటు దక్షిణ నియోజకవర్గంలో గల శాఖా గ్రంథాలయాల్లో అనేక మంది అభ్యర్థులు డీఎస్సీతోపాటు అనేక పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ తీరుతో డీఎస్సీ అభ్యర్థుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. మరో వైపు డీఎస్సీ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు నెలల తరబడి శిక్షణా కేంద్రాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



డీఎస్సీ కోసం ఇప్పటికే కోచింగ్ తీసుకున్నా. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామంటే నిజమేననుకున్నాం. చంద్రబాబు, కూటమి నాయకుల మాటలు అందరం నమ్మాం. డిసెంబర్ అన్నారు..., ఫిబ్రవరి కూడా వెళ్లిపోతుంది. నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారో ఎవరూ చెప్పడం లేదు. డీఎస్సీ అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

– దుంప రజని, అల్లిపురం

నాలుగేళ్లుగా ప్రిపేరవుతున్నా



నేను గత నాలుగు సంవత్సరాలుగా డీఎస్సీకి ప్రిపేరవుతున్నా. గత ఫిబ్రవరిలో వైఎస్సార్ సీపీ డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. అప్పుడు పరీక్ష ఫీజు కూడా చెల్లించాను. ఇంతలోనే ప్రభుత్వం మారింది. మెగా డీఎస్సీ అంటూ గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీని రద్దు చేశారు. చంద్రబాబు సంతకం చేసినా ఇప్పటికీ ఒక స్పష్టత రాలేదు. ఆరిలోవ నుంచి రోజూ జగదాంబ సమీపంలోని జిల్లా గ్రంథాలయానికి వచ్చి ప్రిపేరు అవుతున్నా. నా ఆశలు ఎప్పటికి నెరవేరుతాయో.

– ఎస్.కె.లక్ష్మి, డీఎస్సీ అభ్యర్థి

మెగా డీఎస్సీ తీస్తామంటే నమ్మాం



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీ మీద తొలి సంతకం చేస్తే నమ్మాం. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు కావస్తున్నా నేటికీ నోటిఫికేషన్ వెలువడలేదు. నమ్మినవారిని నట్టేట ముంచింది ఈ ప్రభుత్వం. ఏళ్ల తరబడి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూసి వయస్సు తరిగిపోతుంది కానీ డీఎస్సీ తీసిన జాడ లేదు.

–జల్లూరి ఉషారాణి, అల్లిపురం

తొమ్మిది నెలలు గడుస్తున్నా..



నాకు ఓ వైపు వయసు పెరిగిపోతోంది. డీఎస్సీ తీస్తామని పాలకులు ఆశ చూపిస్తున్నారు. నేడు, రేపు అని జాప్యం చేస్తున్నారు. అసలు తీస్తారో లేదో తెలియడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా నేటికీ అది కార్యరూపం దాల్చడం లేదు. అసలు డీఎస్సీ తీస్తారో తియ్యరో చెప్పే వారే లేదు.

– టి.అంజలి, అల్లిపురం

ప్రభుత్వాలచే పని చేయించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యం



మాట్లాడుతున్న మానవ హక్కుల కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్

డాబాగార్డెన్స్: ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యలు పరిష్కరించడమే మానవ హక్కుల కౌన్సిల్ కర్తవ్యమని కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్‌కి ఆదివారం నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కులు ఏంటి? ఉల్లంఘిస్తే డిఫెండర్లుగా మనం ఏం చేయాలి? హ్యూమన్ రైట్స్ ఎలా ఉన్నాయి? తదితర చట్టాల గురించి పలువురు న్యాయకోవిదులతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అసలు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎప్పుడు ప్రారంభమైంది? ఏ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రారంభించబడింది? అనే అంశాలపై డిఫెండర్స్‌కు వివరించారు. సీనియర్ అడ్వకేట్ ఐఎం అహ్మద్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వేలాది మంది సీనియర్ సిటిజన్స్ ఉన్నారని, వారంతా మానవ హక్కులు కోల్పోతున్నారని, వాటిని తెలియజేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్‌వీ రమణ. తదితరులు పాల్గొన్నారు.

ముంగమూరి దేవదాసు సేవలు విలువైనవి



ఆల్బమ్ ఆవిష్కరిస్తున్న జాన్ వెస్లీ, తదితరులు

సీతమ్మధార: బైబిల్ మిషన్ సెయింట్ దేవదాస్ చర్చిలో ముంగమూరి దేవదాసు వర్ధంతి సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సీతమ్మధార, కేఆర్ఎం కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘ కాపరి మాదే సుకుమార్ సుందర్ అధ్యక్షత వహించారు. ముంగమూరి దేవదాసు 120 సంవత్సరాలు జీవించి క్రైస్తవానికి అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ మాట్లాడుతూ దేవదాసు రాజమండ్రిలో జన్మించి 90 సంవత్సరాలు లూథరన్ మిషన్ ద్వారా క్రైస్తవ్యానికి సేవలు అందించారని కొనియాడారు. బైబిల్ మిషన్‌ను స్థాపించి దేశవ్యాప్తంగా క్రైస్తవ్యానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేవదాసు రాసిన పాటల సంకలనాన్ని మాదే సుకుమార్ వ్యయ ప్రయాసలకు ఓర్చి చక్కని ఆల్బమ్ తయారు చేశారని అభినందించారు. 'ఎవ్వారు గమనింపగలరు' అనే ఆల్బమ్ ఆవిష్కరిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆల్బమ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాదే దేవి సుందరమ్మ, చింతపల్లి విజయ్ కుమార్, సునీత, జోనాథన్ ఫెడ్రిక్, జాసన్ సుందర్, పూల శ్రీనివాస్ పాల్గొన్నారు.

లతా మంగేష్కర్‌పై దృశ్యమాలిక ప్రదర్శన



ఫణీంద్రుడిని సత్కరిస్తున్న చంద్రశేఖర్, రఘురామారావు

సీతంపేట : భారతరత్న గానకోకిల లతామంగేష్కర్ తృతీయ వర్ధంతి సందర్భంగా డాక్టర్ ఫణీంద్రుడు వడ్లమాని రూపొందించిన దృశ్యమాలిక ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లతామంగేష్కర్ జీవిత విశేషాలతో రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రఘురామారావు మాట్లాడుతూ యావత్ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన గాయనీమణి లతామంగేష్కర్ అని కొనియాడారు. ఆరు దశాబ్దాలపాటు 30కిపైగా భాషల్లో వేలాది పాటలు పాడి చిత్ర పరిశ్రమలో తనదైన చెరగని ముద్ర వేశారన్నారు. ఆమె ప్రతిభను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్నతో సత్కరించిందని, ఉత్తమ గాయనిగా ఎన్నో ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డులు అందుకున్నారన్నారు. లతామంగేష్కర్ సుదీర్ఘ సినీ ప్రస్థానంలో ఎంతో విలువైన, అరుదైన వీడియోలు, పాటలు, ప్రసంగాలు, అవార్డులు అందుకున్న అద్భుత క్షణాల వీడియోలను సేకరించి దృశ్యమాలిక రూపొందించిన ఫణీంద్రుడిని అభినందించారు. ఈ సందర్భంగా విశాఖ మ్యూజిక్ అకాడమి మేనేజింగ్ ట్రస్టీ వి.చంద్రశేఖర్ చేతుల మీదుగా దృశ్యమాలిక రూపకర్త ఫణీంద్రుడుని ఘనంగా సత్కరించారు.

అల్లర్లు సృష్టిస్తే రౌడీషీటర్లపై కఠిన చర్యలు



కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ

సీతమ్మధార : ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ద్వారకా సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ముందుగా వారి వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తల దూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గంగాధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- సమాజంలో అల్లర్లు చేయకుండా జీవించాలని ద్వారకా ఎస్ఐ వెంకటరావు సూచించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లుకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా వారి రోజువారీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చిన్నంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జేసీఐ వైజాగ్ స్మార్ట్ నూతన అధ్యక్షురాలిగా జియ్యాని కావ్య



జేసీ కావ్యను అభినందిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

అల్లిపురం: జేసీఐ వైజాగ్ స్మార్ట్ 2025 నూతన అధ్యక్షురాలిగా జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కుమార్తె జేసీ కావ్య జియ్యానిని ఆ సంస్థ జిల్లా ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ప్రమాణస్వీకారం చేయించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో పాటు జేసీఐ ఎన్ఏడీ చీఫ్ జనరల్ మేనేజర్ దివాకర్ జయంత్ హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన జేసీ కావ్యను వారు అభినందించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ జేసీఐ అనేది విద్యార్థి దశ నుంచి వృత్తిలో మంచి నైపుణ్యత కోసం శిక్షణలు, నాయకత్వ లక్షణాలు మెరుగుపరుచుకోవడానికి, వ్యాపారం, కమ్యూనిటీ వృద్ధి అవకాశాలను అందిస్తుందన్నారు. సమావేశంలో సునీత పోలిశెట్టి, జోన్ ప్రెసిడెంట్ ఎ.సంతోష్, జోన్ వైస్ ప్రెసిడెంట్ జేసీ ఓబైద్, జేసీఐ స్మార్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మత సామరస్యమే శాంతికి మార్గం



మాట్లాడుతున్న రామకృష్ణ శాఖానంద స్వామి

సీతంపేట : మత సామరస్యమే శాంతికి మార్గమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో మత సమైక్యత – ప్రపంచ శాంతి వారోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణా ఆశ్రమం స్వామి కృష్ణ శాఖానంద మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలు యుద్ధాలతో సతమతమవుతూ శాంతిని కోల్పోతున్నాయని తెలిపారు. మత సామరస్యం కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపైనా ఉందన్నారు. ఐక్యరాజ్య సమితి శాంతి కోసం కృషి చెయ్యాలని, శాంతి స్థాపనకు మత సామరస్యం దోహదపడుతుందన్నారు. సంస్థ ఛైర్మన్ నరవ ప్రకాశరావు, కె.ఎస్.ఎన్.మూర్తి, ఎల్.ప్రజ్ఞాన్, రామేశ్వరి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న పీఠం పురోహితులు

సీతంపేట : శ్రీలలితా పీఠం 76వ బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సమక్షంలో కుర్తాళం పీఠం పురోహితులు మాచవోలు రమేష్ శర్మ వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి లలితా కామేశ్వరులకు ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు చేపడతామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే సాయంత్రం 6:30 గంటలకు లలితా కామేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐ.సుబ్బరామనాయుడు, యశోదమ్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు పది వేల పెన్నులతో పూజ



ఎర్నిమాంబ అమ్మవారికి పూజించిన పెన్నులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలిసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ద్వాదశి, మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రానున్న పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కావాలని, ఎర్నిమాంబ అమ్మవారి ఆశీస్సులు అందరికీ లభించాలని దైవ సన్నిధిలో దశ సహస్ర (10 వేలు) కలములతో విశేష పూజలు నిర్వహించినట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అమ్మవారి పేరుతో ముద్రించిన పెన్నులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను ప్రత్యేక ఉచిత దర్శనాలకు అనుమతించారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో మూడు పీఠాల పండగ



మూడు పీఠాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం



దివ్య ప్రసాదం అందిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతులు ఆర్చి బిషప్ పొలిమేర జయరావ్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఆదివారం మూడు పీఠాల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ అగ్రపీఠం ప్రత్యేక పరిపాలనాధికారి (ఆర్చి బిషప్) డాక్టర్ పొలిమేర జయరావ్ భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీస్తు ప్రభువు ఇహలోకం నుంచి పరలోకానికి వెళ్లే సమయంలో తాను మానవళి మధ్యలో సజీవంగా ఉండేందుకు గుర్తుగా రొట్టె, ద్రాక్షరసాన్ని ఆశీర్వదించి భుజించమని చెప్పారన్నారు. దివ్య పూజబలిలో సత్ప్రసాదంలోని సాక్షాత్తు క్రీస్తు ప్రభు అంశ ఉంటుందన్నారు. పండగలో భాగంగా సుమారు 120 మంది చిన్నారులు నూతనంగా దివ్య సత్ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం సాయంత్రం జ్ఞానాపురంలోని వడిచర్లవీధి, స్లీప్‌సర్తు మండపంలో, పునీత పేతురు ప్రధాన దేవాలయంలో ఏర్పాటు చేసిన పీఠాల వద్ద దివ్య సత్ప్రసాద ఆరాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండగ వాతావరణంతో పవిత్ర హృదయంతో జరిగిన పాదయాత్రలో నగరం నలుమూలల నుంచి అనేక మంది క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖ అర్చి ప్రత్యేక పాలనాధికారి బిషప్ పొలిమేర జయరావ్ మాట్లాడుతూ వాటికన్ నుంచి పోప్ ఫ్రాన్సిస్ ద్వారా వచ్చిన వర్తమానాన్ని ఈ సందర్భంగా విశాఖ నూతన అగ్రపీఠం ఆర్చిబిషప్‌గా డాక్టర్ ఉడుముల బాల నియమితులైనట్లు జయరావ్ తెలిపారు. కార్యక్రమంలో సెయింట్ పీటర్స్ విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ వేళంగిణీ రాజు, సుమారు 150 మంది గురువులు, కన్య స్త్రీలు, ఆలిండియా కేథలిక్ యూనియన్ సభ్యులు, పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

24న ఉమా నీలకంఠేశ్వర కల్యాణోత్సవం

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలో గల ఉమా నీలకంఠేశ్వర స్వామి వార్షిక కల్యాణం, మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. దేవస్థానంలో కల్యాణ మహోత్సవాలు ఈ నెల 24న అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. 26న బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిస్తామని తెలిపారు. రాత్రి 10 గంటలకు సామూహిక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.